
సాక్షి
పల్నాడు
శనివారం । 21 । అక్టోబర్ । 2023



రామాలయంలో మంత్రి రోజా

మంగళగిరి : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం నూతక్కి అన్నపురెడ్డి రామాలయాన్ని సందర్శించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,322 క్యూసెక్కులు విడుదల చేశారు.

పోలీస్ అమర వీరుల స్థూపం సిద్ధం



నగరంపాలెం(గుంటూరు): పోలీస్ అమర వీరుల దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు నగరంపాలెంలోని అమరవీరుల స్థూపం ముస్తాబైంది. శనివారం ప్రత్యేక కార్యక్రమం జరగనుంది.

అజరం.. అమరం

- చిలకలూరిపేట పోలీసుల త్యాగం మరువలేనిది
- నాటి మావోయిస్టు దాడిలో అసువులుబాసిన రక్షకులు
- ఒక సీఐ సహా ముగ్గురు పోలీసు సిబ్బంది బలి
- ఎస్‌ఐ తల్లి సహా మరో ఇద్దరి మరణం
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

నిశీధిలో నెత్తుటి తూటా

సిద్ధాంతాల మాటున అడవుల్లో సంచరించే మానవ మృగాలు జనారణ్యంలోకి చొరబడి సృష్టించిన రాక్షస కాండ అది. నిశీధిలో.. నిర్దాక్షిణ్యంగా నిముషాల వ్యవధిలోనే జన రక్షకులతో అమాయకులనూ పొట్టనపెట్టుకున్న నెత్తుటి తూటా అది.. ఆ విషాద ఘటన గుర్తొచ్చినప్పుడల్లా చిలకలూరిపేట చిగురుటాకులా వణికిపోతుంది. ఆనాటి హాహాకారాలు ఇప్పటికీ చెవుల్లో మార్మోగుతూ ఒళ్లంతా గగుర్పొడుస్తుందని పేట వాసులు చెబుతుంటారు. ఆనాడు ప్రాణత్యాగం చేసిన పోలీసు వీరులకు ఏటా అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నీరాజనాలు పలుకుతారు.

చిలకలూరిపేట: దేశ ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనది. విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సేవలను స్మరించుకునేందుకు ఏటా పోలీసు శాఖ అక్టోబర్ 21న అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ రోజు వచ్చినప్పుడల్లా రాష్ట్ర చరిత్రలో సంచలనం కలిగించిన చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి, ఆ ఘటనలో అమరులైన వారు గుర్తుకు రాకమానరు.

అదో కాళరాత్రి..


2005 మార్చి 11వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో చిలకలూరిపేట పోలీసు స్టేషన్‌పై మావోయిస్టులు దాడికి తెగబడ్డారు. సుమారు 40 మంది సాయుధులు మూడు గ్రూపులుగా ఏర్పడి అత్యాధునిక ఏకే -47, ఎస్ఎల్ఆర్ ఆయుధాలతో పెను విధ్వంసానికి దిగారు. ముందు పోలీసు స్టేషన్ చుట్టూ కొందరు వలయంగా ఏర్పడి రాకపోకలను నిలిపివేశారు. మరికొందరు స్టేషన్‌లోకి ప్రవేశించారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఆ సమయంలో అప్పటి సీఐ ఆర్.ప్రసాద్, ఎస్ఐ ధర్మేంద్రబాబు కలిసి పోలీసు స్టేషన్ పైఅంతస్తులో ఓ కేసు విషయంలో విచారణ చేస్తున్నారు. ప్రధాన టార్గెట్ అయిన ఎస్ఐ ధర్మేంద్రబాబు కోసమే మావోయిస్టులు ఈ దాడికి పాల్పడ్డారు. దాడి విషయం పసిగట్టిన ఎస్ఐ ధర్మేంద్రబాబు ప్రహరీ దూకి తప్పించుకున్నారు. పోలీసుస్టేషన్ వెనుక భాగంలో ఉన్న తన క్వార్టర్లలోకి వెళ్లేందుకు యత్నిస్తున్న సీఐ ప్రసాద్‌తోపాటు స్టేషన్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ జీఎస్ఆర్ మోహనరావు, కానిస్టేబుల్ ఎస్.ఉమర్, హోంగార్డు ఆర్.వెంకటేశ్వర్లు మావోయిస్టుల తూటాలకు నేలకొరిగారు. పోలీసులకు ఎదురు కాల్పులు జరిపే అవకాశం కూడా దక్కలేదు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు (ఫైల్)

అమాయకులూ బలి

మావోయిస్టుల దాడిలో అమాయకులూ బలయ్యారు. సీఐ కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చి ఉన్న ఆయన మిత్రుడు కె.వీరారెడ్డి, పరీక్ష పేపర్ల కోసం వచ్చిన సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల అటెండర్ బత్తుల హనుమంతరావు కూడా ఈ కాల్పుల్లో మృతి చెందారు. ఎస్ఐ ధర్మేంద్రబాబు కోసం వెతికే క్రమంలో ఆయన క్వార్టర్‌లోకి ప్రవేశించేందుకు సాయుధ నక్సలైట్లు యత్నించారు. క్వార్టర్ ప్రధాన ద్వారం మూసి ఎస్ఐ తల్లి ఉమామహేశ్వరిదేవి తలుపు వెనుక నిలబడ్డారు. లోనికి ప్రవేశించేందుకు మావోయిస్టులు కాల్పులు జరపటంతో చెక్కతలుపు వెనుక ఉన్న ఆమె తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలించే క్రమంలో మరణించారు. ఇదే ప్రాంగణంలో ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పలువురిని మావోయిస్టులు తాళ్లతో కట్టివేసి గ్రెనేడ్‌ను జారవిడిచారు. అయితే అదృష్టవశాత్తూ అది పేలక పోవటంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ఇదంతా కొన్ని నిముషాల వ్యవధిలోనే జరిగిపోయింది.



విధి నిర్వహణలో అమరులైన పోలీసులు

పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమాలు

నాటి పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా పోలీస్ శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఓపెన్ హౌస్, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించడంతోపాటు ప్రదర్శనలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తోంది. నాటి అమరుల స్ఫూర్తితో విధులు నిర్వహిస్తామని పోలీస్ సిబ్బంది ప్రతినబూనుతారు.



రక్తదానం చేస్తున్న పోలీసులు (ఫైల్)

అమరవీరుల ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం



విధి నిర్వహణలో అసువులు బాసిన త్యాగధనుల జ్ఞాపకార్థం పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తాం. విధి నిర్వహణలో అమరులు చూపిన ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకం. వారి త్యాగనిరతిని విధి నిర్వహణలో ఉండే ప్రతి పోలీసూ ఆదర్శంగా తీసుకోవాలి. పోలీసు అమర వీరుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– వై.రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

నవంబర్ 2న వరికపూడిసెలకు శంకుస్థాపన

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వరికపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశం ఇదే

వెల్దుర్తి: ఏడు దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి నవంబర్ 2న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని గొట్టిపాళ్ళలోని ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాధారంపై ఆధారపడి పంటలు పండించుకుంటున్న రైతులు ఈ పథకం కోసం ఎన్నోఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఈ పథకానికి సీఎం జగన్ నవంబర్ 2న శంకుస్థాపన చేయటంతోపాటు ఆ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,673 కోట్లు కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. 2023 జూన్‌లో అటవీ, పర్యావరణ అనుమతులు పొందినట్టు వెల్లడించారు. సీఎం జగన్ నర్సరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలుకు ఈ పనిని అప్పజెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా ఈ ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు సాధించినట్టు వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాచర్ల మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పార్టీ అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వీణాపాణిగా బాలచాముండేశ్వరి



అమరావతి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శుక్రవారం బాలచాముండేశ్వరిని చదువులతల్లి సరస్వతి దేవిగా అలంకరించారు. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతిదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి భక్తుల పూజలందుకున్నారు. అర్చకులు సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన నిర్వహించారు. అలాగే ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

రైతుల సమక్షంలో రీసర్వే పనులు పూర్తిచేయండి



నరసరావుపేట: భూములు రీ-సర్వే పనులు రైతుల సమక్షంలో చర్చించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత డివిజనల్, మండల రెవెన్యూ అధికారులు, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి డీఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో వెబెక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసైన్డ్, ఇనాం భూములు, మ్యుటేషన్ కన్వర్షన్, సబ్ డివిజన్, ఎఫ్-లైన్ పిటిషన్లు వ్యవసాయ భూముల మార్పులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సలహాలు అందజేశారు.

రద్దయిన రైళ్లు పునరుద్ధరణ

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ) : సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం దసరా పండుగను పురస్కరించుకుని గతంలో రద్దయిన రైళ్లను ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు పునరుద్ధరించినట్టు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నంబర్ 07783 విజయవాడ-గుంటూరు రైలు, 07779 గుంటూరు-మాచర్ల, 07580 మాచర్ల-నడికుడి, 07579 నడికుడి-మాచర్ల, 07780 మాచర్ల-గుంటూరు, 07788 గుంటూరు-మాచర్ల రైళ్ళను ఈనెల 23 నుంచి 26 వరకు కేటాయించినట్టు తెలిపారు.

ఐదుగురికి ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం(గుంటూరు పశ్చిమ): ఐదుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న బి.సాంబశివరావు, వి.సత్యనారాయణ, ఎం.ఎస్.వెంకటేశ్వర్లు, వై.సుబ్బారావు, ఎస్.ఎం.సుభానీలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించి గుంటూరు జిల్లాకు కేటాయించారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు సదవకాశం

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపు గడువును బోర్డు పొడిగించినట్టు పల్నాడు జిల్లా డీఐఈఓ ఎం.నీలావతిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో జరగనున్న పరీక్షల ఫీజు గడువును నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్టు వివరించారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ ఫెయిలై, డ్రాపవుట్స్, జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఫెయిలైన విద్యార్థి అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులు జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలకు అర్హులని వివరించారు.



విజయవాడ ఇంద్రకీలాద్రిపై శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతిగా కటాక్షించిన కనకదుర్గ

నీటి గుంతకు అన్నదమ్ములు బలి



ఆస్పత్రి వద్ద మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

- సెలవులు కావడంతో ఆడుకునేందుకు వెళ్లి చిన్నారుల మృత్యువాత
- నరసరావుపేట మండలం గోనెపూడిలో విషాదం
- మృతుల తల్లిదండ్రులను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: అప్పటివరకు ఇంటిలో అల్లరి చేస్తూ.. నవ్వులు చిందించిన ఆ అన్నాదమ్ములు అంతలోనే తీరని విషాదం నింపారు. పాఠశాలకు దసరా సెలవులు కావడంతో సరదాగా ఆడుకునేందుకు వాగు వద్దకు వెళ్లి నీటి గుంతకు బలయ్యారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. ఈ హృదయ విదారక ఘటన మండలంలోని గోనెపూడి గ్రామంలో శుక్రవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెలుగు చెంచయ్య, శివకోటేశ్వరమ్మ దంపతులకు మణికంఠ (10), నవీన్ (8) ఇద్దరు కుమారులు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మణికంఠ, నవీన్‌లు 6, 4 తరగతులు చదువుతున్నారు. దసరా సెలవులు కావడంతో శుక్రవారం ఇంటి సమీపంలోని నలుగురు స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు ఏడుమంగళం వాగు వద్దకు వెళ్లారు. ఆడుకునే సమయంలో మణికంఠ, నవీన్ జారి నీటి గుంతలో పడి మునిగిపోయారు. దీనిని గమనించిన స్నేహితులు పరుగున ఇంటి వద్దకు వచ్చి తల్లిదండ్రులకు చెప్పారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని నీటిలో మునిగిన మణికంఠ, నవీన్‌ను బయటకు తీశారు. అప్పటికే ఊపిరి ఆడక ఇద్దరూ మృత్యువాతపడ్డారు.

గ్రామంలో విషాదం..

ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు కుమారులను చెంచయ్య, కోటేశ్వరమ్మ చదివించుకుంటున్నారు. ప్రమాదంలో ఇద్దరు బిడ్డలను కోల్పోవడంతో వారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఏ పాపం చేశామని ఇద్దరిని తీసుకెళ్లావంటూ కోటేశ్వరమ్మ దేవుడిని ప్రశ్నిస్తూ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున చెంచయ్య నివాసానికి చేరుకుని విగతజీవులుగా పడి ఉన్న చిన్నారులను చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

సాగునీటి కోసం తవ్విన గుంతలు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి కోసం గ్రామ సమీపంలోని ఏడుమంగళం వాగులో గుంతలను తవ్వారు. సుమారు 10 అడుగుల లోతున నీటి గుంతలు ఉన్నాయి. వీటిలోని నీటిని మోటర్ల ద్వారా పంట పొలాలకు తరలించి వినియోగిస్తున్నారు. మణికంఠ, నవీన్ వాగువెంట ఆడుకునేందుకు వెళ్లి ఈ నీటిగుంతలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరామర్శ

ప్రమాదంలో మృతిచెందిన మణికంఠ, నవీన్ మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైద్యశాలకు వద్దకు వెళ్లి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల తల్లిదండ్రులకు సంతాపం తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గిరిజనులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- కొండూరు గిరిజన రైతులు 31మందికి అటవీ భూములు పంపిణీ



అటవీ భూ హక్కు పత్రాలు పొందిన గిరిజన రైతులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ఎన్నో ఏళ్లుగా అటవీభూములను సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు జగనన్న భూహక్కు చట్టం ద్వారా సర్వహక్కులు కల్పిస్తూ, భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. మండలంలోని కొండూరు, తాడువాయి, పెదపాలెం గ్రామాలకు చెందిన 31మంది గిరిజన రైతులకు 42.87ఎకరాల అటవీ భూములపై హక్కు కల్పిస్తూ శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం గిరిజనులకు వరంగా మారిందన్నారు. మండలంలోని పెదపాలెం, తాడువాయి, కొండూరు గ్రామాలకు చెందిన గిరిజన రైతులు ఎన్నో ఏళ్లుగా భూములకు సాగుచేసుకుంటున్నా, వాటిపై హక్కు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతోమంది నిరుపేదలకు అండగా ఉంటూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. పెదపాలెం గ్రామానికి చెందిన 11మంది, తాడువాయికి చెందిన 8మందికి, కొండూరుకు చెందిన 11మందికి మొత్తం 31మంది గిరిజన రైతులకు 42.87ఎకరాల భూమిపై హక్కులు కల్పిస్తూ భూహక్కు పుస్తకాలను పంపిణీ చేశారు. జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎల్.వరలక్ష్మి, సూపరింటెండెంట్ అనూష, డివిజనల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి మేరి, బీట్ ఆఫీసర్ ఏసురత్నం, పెదపాలెం సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, కొండూరు సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు చొప్పరపు రామయ్య, రంగా, కాల్వపల్లి సాంబిరెడ్డి తదితయలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం ఆధ్వర్యంలో గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన కాపు, నాయీబ్రాహ్మణ, రజక, సుగాలి సామాజిక వర్గాలకు చెందిన 70 కుటుంబాల వారు గురువారం రాత్రి టీడీపీని వీడి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పీఆర్కే, పీవీఆర్‌లు కండువాలు కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు బడుగు, బలహీనవర్గాల వారు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. గొట్టిపాళ్ల గ్రామాభివృద్ధికి సీఎం జగన్ ప్రభుత్వం రూ.16కోట్లు అందించామని, మరో రూ.40కోట్ల పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా అండగా ఉంటామని, వారి కుటుంబాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. సర్విశెట్టి చిన మార్కొండయ్య, హరిబాబు, వీరంశెట్టి పుల్లారావు, గరిమడుగుల కోటేశ్వరరావు, శ్రీను, సర్విశెట్టి శ్రీను, శంకర్, పోలకం అంజయ్య, రమేష్, చంద్రయ్యతోపాటు మరో 60 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, పార్టీ మండల అధ్యక్షులు కోట్ల పాపిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను, ఎంపీటీసీ సభ్యులు పోలకం వెంకటనారాయణ, మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లు స్వామి, గొట్టిపాళ్ల గ్రామ సర్పంచ్ కాయకోకుల రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మేకల కోటరెడ్డి, మాజీ సర్పంచ్ మేడబోయిన గోవిందు, ఇన్నయ్య, పిన్నెల్లి వెంకటరెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, ఈడెబోయిన వెంకయ్య, కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, సబ్బసాని కోటిరెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పులుసు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

తప్పు చేశాడు కాబట్టే జైలులో చంద్రబాబు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా తప్పు చేశాడు కాబట్టే 40రోజుల నుంచి జైలులో ఉన్నాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ తప్పూ చేయకపోతే రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు బెయిలు ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. ఇది ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. స్కిల్ కుంభకోణంలో 13 చోట్ల సంతకాలు చేసి రూ.371కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడన్నారు. ఆ డబ్బును షెల్ కంపెనీల ద్వారా తన పీఏకు రప్పించుకొని స్వాహా చేశాడన్నారు. దీనిపై పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టులు బెయిలు ఇవ్వట్లేదన్నారు. ఇంత పనిచేసి వైఎస్సార్ సీపీపై నెపం మోసేందుకు టీడీపీ వర్గీయులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇప్పుడా ఆ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. చంద్రబాబు జైలులో ఉంటే లోకేష్ ఢిల్లీలో ఉంటున్నాడన్నారు. పవన్ కల్యాణ్ హైదరాబాదులో తన షూటింగ్‌లలో బిజీగా ఉంటూ వారానికో పదిహేనురోజులకో ఒకసారి వచ్చి కనపడి ఒక మీటింగ్ నిర్వహించి వెళ్లిపోతున్నాడన్నారు. సీఐడీ పోలీసులు తనను ఎక్కడ అరెస్టు చేస్తారోనని లోకేష్ రాష్ట్రానికి వచ్చేందుకు భయపడుతున్నాడన్నారు. దీంతో టీడీపీని నడిపేవారులేక ఇబ్బందిపడుతుందన్నారు. మళ్లీ ఖచ్చితంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావటం, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- సత్తెనపల్లి నుంచి 14 అర్జీలు



అర్జీదారుడితో మాట్లాడుతున్న జేసీ శ్యామ్‌ప్రసాద్

సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలతో ఇబ్బంది పడేవారు జిల్లా కేంద్రానికి వచ్చే పని లేకుండా ఎక్కడికక్కడ క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను పరిశీలించి అధికారులు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సత్తెనపల్లి నుంచి మొత్తం 14 అర్జీలు రాగా వాటిని అధికారులు స్వీకరించారు. ముందుగా పలువురు అర్జీదారులు తమ సమస్య లను జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కు వివరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్ ఎస్.సురేష్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులూ.. బహుపరాక్!



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

- దళారుల మాటలకు మోసపోవద్దు
- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.7020

గుంటూరు వెస్ట్: క్వింటా పత్తికి ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7020 ఇస్తోందని, పత్తి రైతులు దళారుల మాటలకు మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో నిర్వహించిన పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి పత్తి రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకుని సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లువద్దకు వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకోవాలన్నారు. జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో 3, తాడికొండలో 2, ఫిరంగిపురంలో 1, ప్రత్తిపాడులో 4 మొత్తం 10 కేంద్రాలను గుర్తించామన్నారు. గుర్తించిన మిల్లుల్లోగాని, మార్కెట్ యార్డుల్లోకి గాని దళారులు ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసుకోవాలని జేసీ వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ డీడీ బి.రాజబాబు, ఉదయ్ ఆర్ షా, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు అభినందనలు



నగదు బహుమతి అందిస్తున్న డీపీటీవో విజయకుమార్‌రెడ్డి

చీరాల అర్బన్: ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌కు అవార్డు లభించింది. అత్యధిక ఈపీకే సాధించిన నేపథ్యంలో శుక్రవారం బాపట్ల జిల్లా ప్రజారవాణా శాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీటీవో వై.విజయకుమార్‌రెడ్డి నగదు బహుమతిని అందించారు. చీరాల డిపోలో పల్లెవెలుగు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.సుజాత కుమారి గురువారం అధికంగా కిలో మీటర్‌కు రూ.60.82 తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు బహుమతిని అందించి ప్రత్యేకంగా అభినందించారు. సిబ్బంది సమష్టి కృషితో పనిచేసి అధిక ఆదాయం తీసుకురావడం వలన సంస్థను అభివృద్ధి పథంలో నడిపించవచ్చన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్యామలకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా తెలుగు సాహిత్య సదస్సుకు 'బీరం'



బీరం సుందరరావు

చీరాల అర్బన్: ఈనెల 21 ,22 తేదీల్లో అమెరికాలోని సిలికానాంధ్ర యూనివర్శిటీలో జరగనున్న అమెరికా తెలుగు సాహిత్య సదస్సులో ప్రసంగించేందుకు ఆహ్వానం అందినట్లు ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలకు చెందిన విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావుకు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు వివిధ దేశాలకు చెందిన తెలుగు కవులు, రచయితలు హాజరవుతున్నారు. సుందరరావు 'తెలుగు కవిత్వంలో కొత్త గొంతులు' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ఏడాది జులైలో అమెరికాలో జరిగిన తానా మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చీరాలకు చెందిన పలువురు రచయితలు, వివిధ సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరిగేదిక్కడే

గుంటూరు వెస్ట్ (క్రీడలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల బాలికల క్రీడా పోటీలను కింది తెలిపిన తేదీల్లో నిర్వహిస్తామని నిర్వహణ కార్యదర్శి జి.ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న అండర్-14, 17 బాల బాలికల సాఫ్ట్ టెన్నిస్ పోటీలను తాడికొండలోని ఎస్‌వీఎస్ స్కూల్లో నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన అండర్-14, 17 బాల బాలికల లాన్ టెన్నిస్ పోటీలను స్థానిక బీఆర్ స్టేడియంలోనూ ఏర్పాటు చేశామన్నారు. టెన్నిస్ బాల్‌ను క్రీడాకారులే తెచ్చుకోవాలన్నారు. బొప్పుడిలోని జెడ్పీ హెచ్‌ఎస్ స్కూల్లో టెన్నికాయిట్ పోటీలు, తక్కెళ్లపాడులోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో అండర్-14 బాల బాలికల త్రోబాల్ పోటీలను, గుంటూరులోని శుభం క్రికెట్ అకాడమీలో అండర్-14, 17 బాల బాలికల ఆర్చరీ పోటీలు ఉంటాయన్నారు. 28వ తేదీన పెరవలిలోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో అండర్-17 త్రోబాల్ పోటీలు, గుంటూరులోని ఉర్దూ బాయ్స్ హైస్కూల్లో అండర్-14, 17 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, అండర్-14, 17 బాల బాలికల అథ్లెటిక్ పోటీలను స్థానిక బీఆర్ స్టేడియంలోనూ ఏర్పాటు చేశామన్నారు.

పాత కలప దుకాణాల్లో అగ్నిప్రమాదం

- మూడు దుకాణాలు పూర్తిగా, ఒకటి పాక్షికంగా దగ్ధం
- రూ.50 నుంచి 60లక్షలు నష్టం



ఆహుతి అవుతున్న కలప దుకాణాలు

చిలకలూరిపేట: పట్టణంలోని ఓల్డ్ బ్యారన్‌నగర్ శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓల్డ్ బ్యారన్‌నగర్‌లో పాత కలప దుకాణాలు విస్తరించి ఉంటాయి. పాత భవనాలు, ఇతర కట్టడాలు కూల్చివేసినప్పుడు వాటి నుంచి వచ్చే కలపను సేకరించి తిరిగి తలుపులు, దర్వాజాలు, కిటికీలు వంటివి తయారుచేసి విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఈ దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కపక్కనే దుకాణాలు ఉండటంతో మూడు దుకాణాలు షెడ్లతో సహా పూర్తిగా కాలి నేలమట్టమయ్యాయి. మరో దుకాణం పాక్షికంగా కాలిపోయింది. వీటితోపాటు మంటల వేడికి దుకాణాల పక్కనే ఉన్న మసీదు గోడలు సైతం బీటలు వారాయి. అన్ని దుకాణాల్లో టేకు సరుకు ఉండటంతో భారీగా నష్టం చోటుచేసుకుంది. ఈ అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. షెడ్లు, అందులో కలపతో సహా దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.50 నుంచి 60 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్ శ్రీధర్, చిలకలూరిపేట, నరసరావుపేట అగ్నిమాపక అధికారులు ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంవీ సుబ్బారావు సిబ్బందితో కలసి అగ్నిమాపక వాహనాల ద్వారా మంటలను అదుపు చేశారు. లేని పక్షంలో సమీపంలో ఉన్న ఇతర దుకాణాలకు మంటలు వ్యాపిస్తే నష్టం భారీగా ఉండేదని భావిస్తున్నారు.